ప్రజాశక్తి

శనివారం 22 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

38 రూట్లలో బస్సుల కొరత

◆ అద్దెకు ఆర్‌టిసి సర్వీసులు ◆ ఓ ప్రైవేటు విద్యా సంస్థ సేవలో ఏళ్ల తరబడి 22 బస్సులు
◆ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు ◆ ప్రయాణికులకు ఇక్కట్లు



నగరంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థ సమీపాన బారులుతీరిన ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో ప్రజా అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వ రవాణా లేదు. ఈ విషయాన్ని ఆర్‌టిసి అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఆర్‌టిసిని కార్పొరేషన్ నుంచి ప్రభుత్వంలోకి విలీనం చేసిన నుంచీ ఒక్క కొత్త బస్సు ఇక్కడకు వచ్చింది లేదు. ప్రభుత్వాలు ఇంతవరకూ కొనుగోలు చేసిన బస్సులూ లేవు. విశాఖ జిల్లాలో 38 రూట్లలో బస్సుల కొరత వెంటాడుతోంది. బస్సులు మరిన్ని అవసరమని ప్రజా రవాణా సంస్థ జిల్లా అధికారి అప్పలనాయుడు 'ప్రజాశక్తి'కి తెలిపారు. 70 బస్సుల వరకూ ఆర్డర్ పెట్టామని, త్వరలో రాబోతున్నాయని ఆయన చెబుతున్నారు.

ఓ విద్యాసంస్థకు బస్సుల కేటాయింపు ఇలా..

నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేటు విద్యా సంస్థకు ఏళ్ల కాలం నుంచి 22 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. అద్దెకు ఆర్‌టిసి బస్సుల విధానంలో భాగంగానే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వాలు చేసినప్పటికీ విశాఖ ప్రజా అవసరాలకు తీరని నష్టం చేసేదిగా ఉంది. ప్రజా రవాణాకు సరిపడా బస్సులు లేకుండా ఏళ్లతరబడి ఆ విద్యా సంస్థకు బస్సుల కేటాయింపుపై విమర్శలు వస్తున్నాయి. సంబంధిత విద్యాసంస్థ బయట రోడ్లపై నిత్యం ఆర్‌టిసి బస్సులు దర్శనమిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ఆర్‌టిసి బస్సులను కేటాయించినప్పుడు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం మిగతా 2లో..



సెల్ ఫోన్ టార్చ్ వెలుగుల్లో నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

రోస్టర్‌పై గ్రూప్ 2 అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోస్టర్ పాయింట్స్ సవరించి పరీక్షలను యధావిధిగా కొనసాగించాలని గ్రూప్ - 2 అభ్యర్థులు విశాఖలోని ఎంవిపి.కాలనీలోగల ఆర్‌సి రెడ్డి స్టడీ సెంటర్ వద్ద సెల్‌ఫోన్ల టార్చ్ వెలుగులో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 23న గ్రూప్ - 2 పరీక్షలు జరగనున్న నేపథ్యంలో రోస్టర్ పాయింట్స్ తీరుపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినదించారు. వెబ్ నోట్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వ హయాంలో తాము ఎన్నో బాధలు పడ్డామని, కూటమి ప్రభుత్వం వచ్చినా అవి అలానే ఉన్నాయని మండిపడ్డారు. మంత్రి నారా లోకేష్ అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకొని గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిర్వహించాలన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా : విజయగౌరి

▶ వార్త 8లో..

బాబు మారలేదు : బొత్స

▶ వార్త 2లో..

పెరుగుతున్న జిబిఎస్ కేసులు

కెజిహెచ్‌లో 8 మందికి చికిత్స



రోగుల ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న శివానంద (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో గులియన్ బారో సిండ్రోమ్ (జిబిఎస్) కేసులు పెరుగుతున్నాయి. దీంతో జిల్లా ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొన్నటి వరకూ కెజిహెచ్‌లో ఐదుగురు జిబిఎస్ వ్యాధితో చికిత్స పొందుతుండగా, గ్రామీణ జిల్లా నుంచి మరో ముగ్గురు ఇదే వ్యాధితో గురువారం కెజిహెచ్‌లో చేరారు. దీంతో ప్రస్తుతం అక్కడ జిబిఎస్ వ్యాధితో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. జిబిఎస్ వ్యాధిగ్రస్తులకు సరైన చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఇక్కడ ఈసరికే వైద్యం పొందుతున్న ఐదుగురు రోగులు రోజులు గడుస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో కోలుకోని పరిస్థితి కనిపిస్తోంది. కొద్దిరోజుల క్రితం ఒక మహిళ ఈ వ్యాధితో మరణించిన సంగతి తెలిసిందే. సరైన వైద్యం అందక ఆమె మరణించినట్లు మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఆమె మృత్యువాత పడటానికి ఒక రోజు ముందు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మీడియాతో మాట్లాడుతూ జిబిఎస్ వ్యాధి గురించి ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఇది అంత ప్రమాదకరమైన వ్యాధి కాదని, చాలా పురాతనమైనదని, అంతేకాకుండా ఈ వ్యాధితో వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందివ్వడానికి వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. ఆయన ఈ ప్రకటన చేసిన మరుసటి రోజునే సదరు మహిళ జిబిఎస్ వ్యాధితో కన్ను మూసింది. ఇప్పుడు ఇదే వ్యాధితో మరో ముగ్గురు రోగులు కెజిహెచ్‌లో చేరిన సందర్భంగా శివానంద మీడియాకు వివరణ ఇస్తూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

38 రూట్లలో బస్సుల కొరత

శోచనీయం.

ఆర్‌టిసి దెబ్బతీసే చర్యలు

ఆర్‌టిసిని దెబ్బతీసే చర్యలను కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలోనే మోడీ సర్కారు విద్యుత్ బస్సుల ప్రణాళికను ముందుకు తెచ్చింది. విశాఖకు మరో రెండు నెలల్లో 100 విద్యుత్ బస్సులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు నెలల్లో 15 ఏళ్ల పైబడ్డ బస్సులు 20 శాతం మేరకు 'స్క్రాప్' కింద మారిపోబోతున్నాయి. కొత్తగా వచ్చేవన్నీ విద్యుత్ బస్సులు కావడం, ఇప్పటికే సొంతవి లేకపోవడం, ఉన్నవాటిల్లో ఆయా విద్యా సంస్థలకు అద్దెకివ్వడంతో 'ప్రజారవాణా' భావన కుంటుపడుతోంది. వచ్చేటువంటి విద్యుత్ బస్సులు కూడా వ్యక్తులవి కావు. పెద్ద పెద్ద సంస్థలో, కాంట్రాక్టర్లో నిర్వహించే అవకాశం ఉన్నందున ఆర్‌టిసి క్రమంగా ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లబోతుందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి.

పెరుగుతున్న జిబిఎస్ కేసులు

ప్రస్తుతం ఆసుపత్రిలో 8 కేసులు ఉన్నాయని, వీరికి న్యూరో విభాగ వైద్య నిపుణులతో కలిసి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, రిపోర్టులు వచ్చాక వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. 24 గంటలూ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రత్యేకమైన యాక్షన్ ప్లాన్ రూపొంచామన్నారు. జిబిఎస్ కేసులను నిత్యం పర్యవేక్షణ చేయడానికి మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సత్యప్రసాద్, న్యూమరాలజీ విభాగం డాక్టర్ సతీష్ కుమార్, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్‌లను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు.

వైద్యులు సిద్ధంగా ఉండాలి

- కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిబిఎస్ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున, కెజిహెచ్ వైద్యులు అధునాతన చికిత్సా నైపుణ్యంతో సన్నద్ధమై ఉండటం చాలా అవసరమని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఎఎంసి, కెజిహెచ్ అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్ల కోసం ఆంధ్ర మెడికల్ కాలేజీలోని ఎగ్జామ్ గ్యాలరీలో ముఖ్యమైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిబిఎస్ కేసులలో ప్రజలలో పెరుగుతున్న ఆందోళనలకు ప్రతిస్పందనగా ఈ కార్యక్రమాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కెజిహెచ్ న్యూరాలజీ విభాగ అధిపతి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ జిబిఎస్ వ్యాధికి కారణం, క్లినికల్ ప్రజెంటేషన్, డయాగ్నస్టిక్ విధానాలు, సమకాలీన చికిత్స వ్యూహాలపై పలు కీలకమైన విషయాలను తెలియజేశారు.



మాట్లాడుతున్న శివానంద


డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలపై జర్నలిస్టులు అందించిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ తెలిపారు. శుక్రవారం ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్రాడ్‌కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్లకు చెందిన పలువురు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు చిన్న, మధ్య తరహా పత్రికలకు సంబంధించిన సమస్యలను ఆయనకు వివరించారు. నిబంధనల ప్రకారం వారికి ప్రకటనలిస్తున్నట్లు డిఆర్‌ఒ చెప్పారు. జర్నలిస్టల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహకారం అందిస్తామని, సమన్యాయం పాటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్, చిన్న పేపర్ల అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను తగ్గించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాతా శిశుమరణాలను తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన విశాఖపట్నం జిల్లా మాతా శిశు ఆరోగ్యం అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ మాతా శిశు మరణాలు జరగకుండా ఏ విధంగా నివారణ చర్యలు తీసుకోవాలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులందరికీ వివరించారు. కార్యక్రమంలో కెజిహెచ్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిహెచ్.చక్రవర్తి, అగనంపూడి సామజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, కెజిహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్ఒడి డాక్టర్ వి.రవి తదితరులు పాల్గొన్నారు.

బాబు మారలేదు

రైతులు, వ్యవసాయం దండగ అనే భావనలోనే ఉన్నారు

శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స


మీడియాతో మాట్లాడుతున్న బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు ఏమీ మారలేదని, రైతులు, వ్యవసాయం దండగ అనే భావనలోనే ఉన్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మిర్చి రైతుల కష్టనష్టాలు తెలుసుకోవడానికి వైఎస్.జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్తే తప్పేంటని, అది ఇల్లీగల్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. బీచ్ రోడ్డులోగల తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ విజయవాడలో అట్టహాసంగా టిడిపి ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహించడం లీగల్ అవుతుందా అని చంద్రబాబుకు సూటి ప్రశ్న వేశారు. జగన్ మిర్చి యార్డ్‌కు వెళ్లిన తర్వాత మిర్చి రైతుల ఆవేదన ప్రభుత్వానికి తెలిసిందని అన్నారు. రైతులకు మద్దతు ధర ఇవ్వాలనే ఆలోచన రెండు నెలల క్రితమే ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర మంత్రి ఢిల్లీలో లేనప్పుడు మిర్చి రైతుల కోసం చర్చించడానికి వెళుతున్నామని చంద్రబాబు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వెళ్ళేవారికి భద్రత ఎలా ఇస్తామంటూ జగన్‌ను ఉద్దేశించి సిఎం హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతారహితంగా మాట్లాడటం దారుణమని అన్నారు. జగన్‌కు భద్రత కల్పించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీనిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సందర్భంలో ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారని బొత్స తెలిపారు. విశాఖలో జరిగిన భూ కుంభకోణాలపై విచారణ నివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికులను తగ్గించే కుట్రలు తగవు

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను తగ్గించే కుట్రలను యాజమాన్యం మానుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1472వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, పలు విభాగాల ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఒకపక్క శాశ్వత ఉద్యోగులకు విఆర్ఎస్ పేరుతో బయటకు సాగనంపుతూ.. మరోపక్క కాంట్రాక్టు కార్మికులను తొలగించి స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను తగ్గించే కుట్రలకు యాజమాన్యం తెగబడుతోందన్నారు. ఇప్పటికే కార్మికులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ చర్యలతో అన్ని విధాలుగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పుడు ఉన్న ఉపాధిని కూడా తొలగించే చర్యలు చేపట్టడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను తగిన సామర్థ్యంతో నడిపించడానికి కృషి చేస్తున్నామని చెబుతూనే కార్మికుల తొలగింపు చర్యలు దేనికని ? ప్రశ్నించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాల కుట్రలను కార్మికులు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు.

రీ సర్వే సమాచారాన్ని ముందే తెలియజేయాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : రీ సర్వే చేపట్టబోయే గ్రామాల్లో రైతులకు ముందస్తు సమాచారం అందించాలని, నిబంధనల మేరకు సంబంధిత నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని దాకమర్రి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పొలాల్లో కలియ తిరిగి పరిస్థితులను గమనించారు. అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. భూముల పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చేపడుతున్న ఈ ప్రక్రియకు రైతులు పూర్తి సహకారం అందించాలని, దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు.

అనంతరం అదే గ్రామంలో ఉన్న సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నారా లేదా అని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే వినతులకు త్వరిత గతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎన్.హనుమంతరావును ఆదేశించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలని, ప్రజా రోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పైలా రామారావు, ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.


భీమిలి మండలం దాకమర్రిలో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్

గొట్టిపల్లిలో రీసర్వేను జెసి పరిశీలన

ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లిలో రీ సర్వేను విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం పరిశీలించారు. రీ సర్వేపై తహశీల్దార్ పేర్ల శ్యామ్‌ప్రసాద్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి గోవిందరావు, విఆర్‌ఒ సుమలత, సర్వేయర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండలంలోని నరవ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో కొండ వద్ద గల గ్రావెల్ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. పోక్షికంగా కాలి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సిఐ సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని వయసు సుమారు 25 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.4 అడుగులు, నీలం రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నారని సిఐ తెలిపారు. క్లూస్ టీమ్‌తో కలిపి దర్యాప్తు చేస్తామని చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

యువకునిపై దాడి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసినట్లు యువకుడు దుర్గాప్రసాద్ తెలిపాడు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న తాను పని ముగించుకొని గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆపి మొబైల్ ఇమ్మని అడిగాడని, అతని వద్ద మద్యం తాగిన వాసన రావడంతో ఇవ్వలేదని తెలిపాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి కత్తి తీసి తనపై దాడి చేశాడని వివరించాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు యువకుడు తెలిపాడు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వెల్లంకి విద్యుత్ సబ్ స్టేషన్ 11కెవి మరమ్మత్తుల దృష్ట్యా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట తదితర ప్రాంతాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మద్దిలో పశువుల సంత ఏర్పాటు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో నూతనంగా పశువుల సంతను ఏర్పాటుచేసినట్లు సంత నిర్వాహకులు బుగత అప్పలనాయుడు తెలిపారు. ప్రతి శనివారమూ నిర్వహించే ఈ సంతలో అన్ని రకాల వ్యాపారాలు కొనసాగించుకోవచ్చని పేర్కొన్నారు. నీడ కోసం 20 కమ్మల పందిరిలు, పశువులు కోసం 10 నీటి తొట్టెలు కల్పించామని తెలిపారు. ఎల్లమ్మ తల్లి పశువుల సంతగా నామకరణం చేసినట్లు వివరించారు. సంత ఏర్పాటుకు అన్ని అనుమతులు పొందినట్లు తెలిపారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు కొండపేట పంప్ హౌస్ సమీపంలో తెలుగు యువత అధ్యక్షులు గరే సదానంద ఆర్థిక సాయంతో శుక్రవారం చంద్ర మౌళి, సత్యవతి దంపతుల చేతుల మీదుగా హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంగూరి సీతారామదొర, టిడిపి నాయకులు తమ్మిన సూరిబాబు, తాటిపూడి అప్పలరాజు, ఎర్నింటి వెంకటరావు, కొప్పుల కృష్ణ, నరవ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం నుండి రెడ్డిపల్లి వెళ్లే రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు పనులు గత పదేళ్లుగా నిలిచిపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధే లక్ష్యంగా బయోమెడికల్ ఇంజినీరింగ్

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచేలా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బయోమెడికల్ ఇంజినీరింగ్ కోర్సును ప్రారంభించిందని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ రంగంలో అవకాశాలు అనే అంశంపై బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్‌తో పాటు వైద్య కళాశాల గీతంలో ఉండటాన్ని ప్రయోజనకరంగా మలచుకునే విధంగా నిపుణుల పర్యవేక్షణలో కోర్సును రూపొందించామన్నారు. విశాఖ మెడ్‌టెక్‌జోన్ సహకారంతో ఈ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య పరికరాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేయడానికి బయోమెడికల్ ఇంజినీరింగ్ నిపుణుల అవసరం ఉందన్నారు. సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలపై బయోమెడికల్ ఇంజినీరింగ్ నిపుణులు దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం వ్యవస్థాపకుడు డాక్టర్ విజయ్ వైద్యనాథన్ మాట్లాడుతూ, ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేయగల సామర్థ్యం బయోమెడికల్ ఇంజినీరింగ్ నిపుణులకు ఉందన్నారు. బయోమెడికల్ రోబోటిక్స్, బయోమెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్, బయోత్రిడి ప్రింటింగ్ తదితర అంశాలపై జరుగుతున్న పరిశోధనలు వివరించారు. గీతం బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ, బయోమెడికల్ ఇంజినీరింగ్ ప్రాధాన్యతను వివరించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ చక్రధరరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : నేరస్తులు కొత్త కొత్త పద్ధతులు అనుసరించి దొంగతనాలకు ఒడిగడుతున్నారని, దీనిపై ప్రజలు అవగాహన చేసుకొని అప్రమత్తంగా ఉండాలని ద్వారకా నేర విభాగం సిఐ వి.చక్రధరరావు సూచించారు. విశాలాక్షినగర్‌లోని బివికె కాలేజీలో విద్యార్థులకు దొంగతనాలు, ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చక్రధరరావు మాట్లాడుతూ, నగరంలో జరుగుతున్న దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన చేసుకొని ఇంట్లో తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని సూచించారు. వీలైనంతవరకు ఇంట్లో సిసి కెమెరాలు అమర్చుకోవాలని, ఊరు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ ఎ.హరికృష్ణ, బివికె స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన పరిశీలన

ప్రజాశక్తి-పద్మనాభం : 21వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని పశుసంవర్థక శాఖ జెడి డి.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పద్మనాభం, రెడ్డిపల్లి గ్రామాల్లో పశు వైద్య కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశుగణన ఈ నెలాఖరుతో పూర్తి కానుందని తెలిపారు. పశుగణన సర్వే 6,22,937 కుటుంబాల్లో పూర్తి చేశామన్నారు. గతం కంటే ఎక్కువ కుటుంబాలు మూగజీవాలను పెంపకం చేస్తున్నాయని తెలిపారు. కుక్క, పిల్లి, కోడి, పలు రకాల ఇతర జంతువులు గతంలో జరిగిన పశు గణనలో 66 వేలు ఉండగా ప్రస్తుత పశు గణలో 67,000కు చేరినట్లు తెలిపారు. మేకలు గొర్రెలు గతంలో 79 వేలు ఉంటే ఈ ఏడాది 81 వేలుకు చేరుకున్నట్లు వివరించారు. విశాఖ జిల్లాలో 7.30 లక్షల కోళ్ళ ఫారాల ద్వారా పెంపకంలో ఉన్నాయని తెలిపారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో మాంసం, కోడి గుడ్లను బాగి ఉడికించి తినాలని సూచించారు. గత ఏడాది గడ్డి విత్తనాలు ఏడు టన్నులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి, పద్మనాభం పశు వైద్యాధికారులు లక్ష్మణరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి మండల తహశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా సందర్శించిన ఆయన అక్కడి సిసి కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గీతంలో భట్నాగర్ జయంతి

ప్రజాశక్తి -మధురవాడ : సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతిని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని భట్నాగర్ ప్రయోగశాల వద్ద నిర్వహించారు. భట్నాగర్ విగ్రహానికి సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిఎస్.కృష్ణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజహితానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడాలన్నారు. భారతదేశం విజ్ఞాన శాస్త్ర రంగంలో అభివృద్ధి చెందడానికి సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి పరిశోధకుల దూరదృష్టి కారణం అన్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్‌ను సైన్స్ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

టమోటాను మార్కెట్ కమిటీచే కొనుగోలు

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం: టమోటా ధర పతనం కావడంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మార్కెట్ కమిటీ ద్వారా కొనుగోలు చేసి రైతు బజార్లో అమ్మకాలు చేపడతామని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు శ్రీనివాస్ కిరణ్ తెలిపారు. పద్మనాభం మండలంలోని అనంతవరం, కొవ్వాడ గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టమోటాను రైతుల కూడా నేరుగా రైతు బజార్ల అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ కార్యదర్శి బి.లక్ష్మీచైతన్య, సూపర్‌వైజర్ కె.మేరీ తదితరులు పాల్గొన్నారు

సీతమ్మధార : గ్రామాల్లో టమోటా పండించిన రైతులు నేరుగా రైతు బజార్‌కు తీసుకొచ్చి విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ సెక్రటరీ పాపారావు తెలిపారు. సీతమ్మధార రైతుబజార్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టమోటా రైతులు ఇబ్బందులు పడకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వినియోగదారుల పట్ల రైతుల క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

ఆవు పొట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆపరేషన్ చేసి తొలగించిన పశువైద్యాధికారి అనిల్‌కుమార్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం, పశు వైద్యశాలలో గురువారం ఆవుకు ఆపరేషన్ చేసి పొట్టలో ఉన్న 50 కేజీల ప్లాస్టిక్‌ను తొలగించారు. వేములవలస రైతు కోరాడ నాయుడుబాబు ఆవు 5 రోజుల నుంచి మేత మేయడం లేదని, కింద పడుకోవడానికి ఇబ్బంది పడుతుందని పశువైద్యుని సంప్రదించారు. డాక్టర్ అనిల్‌కుమార్ పరీక్షించి ఆపరేషన్ చేశారు. పొట్టలో నుంచి 50 కేజీల వరకు ప్లాస్టిక్ కవర్లు, తాళ్లను తొలగించారు. ప్లాస్టిక్ వల్ల మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని డాక్టర్ అనిల్ కుమార్ చెప్పారు. పశువైద్య సిబ్బంది సుజాత, దుర్గ లక్ష్మి, రమణ, సంతోష్, సాగర్, సుబ్రహ్మణ్యం, నర్సింగ్ పాల్గొన్నారు.

వైసిపి గాజువాక బిసి సెల్ ప్రెసిడెంట్‌గా చిత్రాడ

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి గాజువాక నియోజవర్గం బీసీ సెల్ అధ్యక్షులుగా చిత్రాడ వెంకటరమణ నియమితులయ్యారు. ఈ పదవిని కట్టబెట్టినందుకు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డికి వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

తాగు నీరు వృథా

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 63, 40 వార్డుల్లో తాగునీరు వృథాగా పోతోంది. గత మూడు నెలల నుంచి ఈ పరిస్థితి ఉన్నా నీటి సరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 63వ వార్డు పరిధి జయేంద్రకాలనీ ఆటో స్టాండ్ ప్రాంగణంలో ఎయిర్ వాలు పైపు విరిగిపోవడంతో జివిఎంసి నీటిని సరఫరా చేసేటప్పుడు ప్రధాన మార్గం మొత్తం జలమయమవుతోంది. పది అడుగుల దూరంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు నీరు చేరుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జివిఎంసి 40వ వార్డు పరిధి బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ పక్కన ప్రధాన గెడ్డలో ఉన్న పైపు నుంచి నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని జివిఎంసి నీటి సరఫరా విభాగం సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పైపులైన్ జివిఎంసికి సంబంధం లేదని, ఎంఇఎస్‌కు చెందిన లైను అని, ఈఎస్ఐ హాస్పిటల్‌కు వెళ్లే పైపు లైను నుంచి లీక్ అవుతుందని జివిఎంసి సిబ్బంది చెబుతున్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ ఎదురుగా అధిక మొత్తంలో నీరు పోతూ మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో వాహనాలు నిలిపే ప్రదేశంలోకి చేరుతోంది. ఇళ్లకు చేరాల్సిన నీరు లీకుల వల్ల నేలపాలు అవుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కొత్తగా వచ్చిన ఏఈ నాగేశ్వరరావు దృష్టికి ఈ సమస్య వెళ్లిందని, త్వరితగతన పరిష్కారానికి చర్యలు చేపడతారని సంబంధిత అధికారులు తెలిపారు. నీరు లీకేజీ లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

23న ఉత్తరాంధ్ర న్యాయవాదుల కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిదులు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర న్యాయవాదుల కమిటీని ఆదివారం ఏర్పాటు చేస్తున్నామని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, సెక్రటరీ డి.నరేష్ కుమార్ తెలిపారు. పోర్టు పోలియో జడ్జి రఘునందనరావు విశాఖపట్నం జిల్లాకు కొత్త అడ్మినిస్ట్రేట్ జడ్జిగా నియమతులైన సందర్భంగా హర్షం వ్యక్తపరుస్తూ, విశాఖపట్నం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 23వ తేదీన ఉత్తరాంధ్ర కమిటీ ఏర్పాటుకు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లా, విశాఖపట్నం, జిల్లాల ప్రముఖ న్యాయవాదులు సమావేశం కానున్నట్లు తెలిపారు. ఆదివారం ఏర్పాటైన కమిటీ ద్వారా హైకోర్టు బెంచ్ కోసం ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బిఇ.శ్రీనివాస్, మెంబర్ ఎం.గౌరీప్రసాద్, ప్రముఖ న్యాయవాదులు పాల్గొన్నారు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల వ్యాపార అవకాశాల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రత్న ఇంజనీరింగ్ కన్స్ట్రక్షన్ కంపెనీ అధినేత అనార్‌బాబు కోరారు. గాజువాక ఆటోనగర్‌లో ఎస్సీ ఎస్టీ హబ్ ఆధ్వర్యాన జిఇఎం పోర్టల్ రిజిస్ట్రేషన్ ఆటోనగర్‌లోని రత్న ఇంజినీరింగ్ కంపెనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ అని తెలిపారు. ప్రభుత్వ అందించే ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని వ్యాపార అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కోరారు. హైదరాబాద్ నుంచి ఎస్‌సి, ఎస్‌టి హబ్ నుండి బి.శ్రీకాంత్, ఎస్‌ఎల్‌ఎన్.ప్రసాద్ హాజరై ఎస్‌సి, ఎస్‌టి ఎంటర్ప్రెన్యూర్స్‌కి సూచనలు, సలహాలు అందించారు. వ్యాపార అవకాశాలు తెలియజేశారు. మహిళా అభ్యర్థులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

నాయకులుగా యువత

ప్రజాశక్తి-ములగాడ : యువతను నాయకులుగా తీర్చిదిద్ది, ప్రజాస్వామ్య విజయానికి జాతీయ సేవా పథకం ఎంతగానో కృషి చేస్తోందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ జాతీయ సేవా పథక కార్యకర్తల అభినందన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాసం జాతీయ సేవా పథకానికి రెండు కళ్ల వంటివని అన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర మరువలేనిదని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేస్లిన్ ప్రసంగించారు. అనంతరం వివిధ సేవా కార్యక్రమాలలో, చైతన్య ర్యాలీలో, ప్రత్యేక సేవా శిబిరాల్లో, వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్, జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులు వై.అనసూయాదేవి, నదియా, సంధ్యారాణి, అంజలీదేవి పాల్గొన్నారు.



యువతరంగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

సర్దార్ నెస్ట్‌లో చిన్మయి యువతరంగ్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక సర్దార్ నెస్ట్ ఉత్సవ్ ఫంక్షన్ హాల్‌లో చిన్మయి మిషన్, సర్దార్ ప్రాజెక్ట్స్ ఆధ్వర్యాన 3000 మంది విద్యార్థులతో చిన్మయ యువతరంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి, భగవద్గీత పారాయణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బండారు సత్యనారాయణమూర్తి, సర్దార్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు.

కప్పరాడలో డిఎంహెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం లక్ష్మీనగర్, బాపూజీనగర్, కప్పరాడ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి, ఓపి, ఐపి, సేవలు, ఇహెచ్ఆర్ డయాగ్నొస్టిక్ సేవలు, మందులు, వ్యాక్సిన్ పోటేన్సి, ముఖ్యంగా ఎన్‌సిడి 3.0 సర్వే, ఎన్‌సిడి 2.0 ఫాలో-అప్, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె తదితరాలపై ఆరా తీశారు. కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవలు గురించి వైద్య సిబ్బందికి విశదీకరించారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాదించాలని ఆదేశించారు. తదుపరి ఫ్రైడే-డ్రైడే జరుగుతున్న ప్రదేశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమావతి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోన్ పరిధి పెదగంట్యాడలోని టిడ్కో గృహాలను ప్రాజెక్టు అధికారులు శుక్రవారం సందర్శించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో గృహ నివాసితులకు మౌలిక సౌకర్యాల కల్పన కోసం తీసుకోవలసిన చర్యలను పర్యవేక్షించారు. తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు కోసం తక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో టాటా ప్రాజెక్టు అధికారులు, ఈఈ సుధాకర్, ఏడీఈ రాజేష్ చంద్ర, ఏఈ ఎలక్ట్రికల్ అధికారులు, టాటా ప్రాజెక్టు కాంట్రాక్టర్ వర్మ, నివాసితులు పి.అప్పలరాజు, ముత్యాల లక్ష్మి, భాస్కర్‌రావు, హసేన్ ఖాన్, రహీమా, నాగేశ్వరరావు, రమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

నర్సింగ్ హోమ్ సందర్శన

ప్రజాశక్తి-పెందుర్తి : విద్యార్థులు అస్వస్థతకు గురైన ఇందిర నర్సింగ్ హోమ్ హాస్టల్‌ను సిపిఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, ఎఐవైఎఫ్ నాయకులు వై.రాంబాబు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు శుక్రవారం పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండడం, 120 మందికి 6 మరుగుదొడ్లు, మరో 6 స్థానం గదులు ఉండడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో అనేక హోమ్స్, హాస్టళ్లు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ఘటనపై అధికారులకు వినతి పత్రాన్ని అందిస్తామని, స్పందించకుంటే సమరశీల పోరాటాలకు సమాయత్తం అవుతామని హెచ్చరించారు.

పరామర్శలు

ప్రజాశక్తి -గాజువాక : 76వ వార్డు పరిధి బర్మా కాలనీలో విధి నిర్వహణలో ఉండగా ప్రమాదానికి గురైన జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్ ఎం.చిన్నారావును జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కార్యదర్శి గొలగాని అప్పారావు పరామర్శించారు.

జివిఎంసి 86వ వార్డు పరిధి వైసిపి సీనియర్ నాయకులు సాగి సునీల్ రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఆయన్ను పార్టీ గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవన్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుగ్గపు దానప్పలు, వార్డు బీసీ సెల్ ప్రెసిడెంట్ ముద్దప్ మురళీమోహన్, నెల్లూరు శ్రీను, కింతల బాబూరావు, సుబ్బయ్య, ఇందుపల్లి అప్పారావు, కనకరాజు పాల్గొన్నారు.

'శ్రీపాద'లో నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార శ్రీపాద డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీపాద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డి.రాజేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కదారిస్ గ్రూప్స్, ఎస్‌బిఐ కార్డ్స్, టోస్మార్ట్ సొల్యూషన్స్, హెచ్‌ఆర్ ఇంటర్న్‌షిప్, నవరాధి టెక్నాలజీస్, ఇండియన్ బ్యాంక్, వావిన్, ఫెనెస్టా, మయోరా, ఫాక్స్‌కాన్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని వివరించారు. ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలు కళాశాల వెబ్‌సైట్ www.sreepaadadegreecollege.org ను, 8121149149, 9010973762 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ట్రేడ్ ఫెయిర్ స్టాల్స్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్ట్ స్టేడియంలో ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ స్టాల్స్‌ను నేవల్ కమాండర్ మురళీమోహన్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ ఉత్పత్తులు ఈ స్టాళ్లలో లభిస్తాయని, నేచురల్ డ్రై ఫ్రూట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫర్నిచర్, వివిధ గ్లాస్ మోడల్ స్టాల్స్ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. సుమారు 500 స్టాల్స్ ఏర్పాటయ్యాయని, విశాఖ ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్‌రాజు, రామకృష్ణరాజు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాబోధనే లక్ష్యంగా...

-1983 నుంచి కేథరిన్ విజయప్రస్థానం
-నేడు, రేపు వార్షికోత్సవం



పాఠశాల గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : ఉన్నత విద్యాబోధనే లక్ష్యంగా 'కేథరిన్' విద్యా సంస్థలు నడుస్తున్నాయి. సంస్థ సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్ళు... మరెన్నో ఎత్తు పల్లాలు.. వీటన్నింటినీ అధిగమించి ఈ ప్రాంతంలో ఉత్తమ విద్యా సంస్థగా గుర్తింపు పొందింది.

ఇప్పుడున్న ఆరెకరాల సువిశాల పాఠశాల ప్రాంగణం చుట్టూరా పచ్చదనం... పిల్లల సందడి... విశాలమైన తరగతి గదులు.. డిజిటల్ బోధన...అర్హత, అనుభవం గల ఉపాధ్యాయులు, అంకిత భావం గల సిబ్బంది.. క్రీడలు, ఆట పాటలు.. కరాటే.. వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్స్‌లో వారంలో ఒక సారి శిక్షణ తదితర ప్రత్యేకతలతో నడుస్తోంది. 1983లో 50 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులతో ప్రారంభమైన పాఠశాల ప్రస్థానం నేడు దాదాపు 1500 మంది విద్యార్థులు, 150 మంది ఉపాధ్యాయుల స్థాయికి చేరింది.

ఎల్‌కెజి నుంచి టెన్త్ వరకు ఇంగ్లీష్ మీడియంలో ఇక్కడ విద్యను బోధిస్తున్నారు. 2024 నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఇక్కడ అమలవుతోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతో మంది వైద్యులుగా, ఉపాధ్యాయులుగా, ఆర్మీ, నేవీ, పోలీస్, సాఫ్ట్‌వేర్ ఇలా అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

ఎన్ఎస్, పిఎస్, గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ప్రయోగశాల ఉంది. ఎంతో మంది మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించి పుస్తకాలు, సైకాలజీ, ఇతరత్రా మరెన్నో పుస్తకాలతో కూడిన గ్రంథాలయం అందుబాటులో ఉంది. ఎయులో భౌతిక శాస్త్రవిభాగాధిపతిగా, రెక్టార్‌గా ఉన్న ఆచార్య ఆర్‌డి.రత్నరాజ్, అప్పట్లో విద్యా విభాగాధిపతిగా ఉన్న కీర్తిశేషులు ఆచార్య రత్న బాల దంపతులు ఈ విద్యా సంస్థను స్థాపించారు. 2003 నుంచి వారి కుమారుడు ఆలివర్ రాయి కరస్పాండెంట్‌గా కొనసాగుతున్నారు. ఈయన సతీమణి డాక్టర్ ఇవాంజలిన్ రాయి డైరెక్టర్‌గా ఉంటూ విద్యా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో నేడు, రేపు 41వ వార్షికోత్సవ జరుగనుంది.

క్రమశిక్షణకు పెద్ద పీట

తమ పాఠశాలలో క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తున్నాం. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపుతున్నారు. దేశ భక్తి, శాస్త్రీయ ఆలోచనలు వారిలో నెలకొల్పుతున్నాం. ఏటా టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. వాలీబాల్, బేస్‌బాల్, హ్యాండ్ బాల్, క్రికెట్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ఎన్నో పతకాలు సాధించారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పిస్తున్నాం.



ఆలివర్‌రాయ్
కరస్పాండెంట్
కేథరిన్ విద్యాసంస్థలు

కస్తూర్బా ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : కెజిబివి ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం మానవీయత ప్రదర్శించి పరిష్కరించాలని యుటిఎఫ్, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెజిబివిల పనిగంటలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. నైట్ డ్యూటీ చేసే ఉపాధ్యాయులు ప్రతిరోజు రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 11 గంటల వరకు వరుసగా 26 గంటలు పనిచేయడం మానవ హక్కుల ఉల్లంఘనేనన్నారు. వారి పనిగంటలను తగ్గించాలన్నారు. నైట్ డ్యూటీల విషయంలో గతంలో ఉన్న ఇద్దరు టీచర్లకు బదులు ముగ్గురికి పెంచడం వల్ల సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.అంతేకాక తీవ్ర పని ఒత్తిడికి, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కెజిబివి పాఠశాలల్లో వార్డెన్ పోస్ట్ మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. గత ఏడాది సమ్మెకాలం జీతాలు జిల్లాలో 14 మంది సిబ్బందికిగాను 10 రోజులు జీతాలు ఇంకా విడుదల కాలేదని, వెంటనే మంజూరు చేయాలని డిఇఒను కోరారు. కస్తూర్బాలలో పనిచేస్తున్న స్టాఫ్‌కు అప్షనల్ హాలిడేస్‌ను వర్తింపజేయాలని, బోధనేతర సిబ్బందికి వారంతపు సెలవులు అమలు చేయాలని కోరారు. కస్తూర్బా పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంట పనివాళ్లను పెంచాలని, స్వీపర్, ఇతర సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక స్టడీ తరగతులకు హాజరౌతున్న టీచర్లకు సిసిఎల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ సమస్యలన్నిటిని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ అనకాపల్లి జిల్లా జెఎసి నాయకులు వివి శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు కరణ జ్యోతి పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ఎన్‌టిపిసి అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకం



మీడియా మీట్‌లో మాట్లాడుతున్న ఎన్‌టిపిసి అధికారి

ప్రజాశక్తి- పరవాడ : ఎన్‌టిపిసి సింహాద్రి ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడలోని ప్రయివేటు హోటల్‌లో తెలుగు మీడియా మీట్ 2025 నిర్వహించారు. సంస్థ హెచ్ఆర్ హెడ్‌బిబి పాత్రా కార్యక్రమాన్ని ప్రారంభించి, సంస్థ కార్యకలాపాలు, విజయాలను హైలైట్ చేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సమీర్‌శర్మ మాట్లాడుతూ, సంస్థ యాజమాన్యంతో మీడియా ప్రతినిధులు నేరుగా సంభాషించడానికి, వారి విలువైన అనుబంధాన్ని బలోపేతం చేయడానికి, అర్థవంతమైన ఆలోచనల మార్పిడికి ఈ సమావేశం వేదికగా నిలిచిందన్నారు. సీనియర్ అధికారులు జీఎం టిఎస్ఎస్ పద్మప్రియ, ఎజిఎం ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ వేలాయుధన్ పిళ్లై జయన్, సిఎస్ఆర్, పిఅండ్ ఎస్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని కైట్స్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ సెకెండియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఎదిగినా, ఒదిగి ఉండాలని, విద్యాబుద్ధులు నేర్పించిన గురువు లను గౌరవించాలన్నారు. కష్టపడి చదివి ఉన్నతస్థానాలలో రాణించాలని, అప్పుడే తల్లిదండ్రులకు గురువులకు మంచిపేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి, సీనియర్లను సత్కరించిన జూనియర్లు, వారిని ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. కైట్స్ విద్యా విహార్ స్కూల్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, డైరెక్టర్స్ విల్లూరి ప్రసాద్, అడిగర్ల శంకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు ..

డ్రగ్స్ నియంత్రణపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- అనకాపల్లి : గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నియంత్రణ చట్టాలు, దర్యాప్తు విధానాలపై నైపుణ్యాలను పెంపొందించేందుకు, విశాఖపట్నం రేంజ్ డిఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశాల మేరకు అనకాపల్లి, అల్లూరి జిల్లాలలోని ఎస్ఐ నుంచి పైస్థాయి పోలీసు అధికారులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. శుక్రవారం గుండాలోని జివిఎంసి సమావేశ మందిరంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్ అధికారి ఏ.రంగధామ్ మాదకద్రవ్యాల నియంత్రణకు చట్టపరమైన అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎన్‌డిపిఎస్ కేసులు న్యాయస్థానంలో విచారణకు వెళ్లినప్పుడు వందశాతం శిక్షలు పడటం లేదని,ఎఫ్ఐఆర్ నమోదు నుంచి ఛార్జ్‌షీట్ దాఖలు వరకు అన్ని ప్రొసీజర్లను కచ్చితంగా పాటించాలన్నారు. ఎఎస్‌పిఎల్.మోహన రావు మాట్లాడుతూ సీనియర్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో శిక్షలు శాతం పెరిగేలా చూడాలన్నారు. వర్క్‌షాప్‌లో ఎస్‌బి డిఎస్‌పి బి.అప్పారావు, ఇన్స్పెక్టర్లు డిసిఆర్‌బి ఎస్.లక్ష్మణమూర్తి, ఎస్‌బి ఎస్.బాలసూర్యారావు, టాస్క్‌ఫోర్స్ జి.ప్రేమ్‌కుమార్, ఎన్‌డిపిఎస్ సెల్ గఫూర్, ఉమ్మడి జిల్లాల సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



రంగధామును సత్కరిస్తున్న పోలీసు అధికారులు

'నోటీసు వెనక్కు తీసుకోవాలి'

ప్రజాశక్తి -అనకాపల్లి : లీడర్ పత్రికకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎపియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పెంటకోట జోగినాయుడు, కార్యదర్శి కె. చంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖ ఆర్డీవో శ్రీలేఖపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. తనకు లేని అధికారాల్ని కట్టబెట్టుకుని, పత్రికా స్వేచ్ఛకు విరుద్ధంగా కనీసం కలెక్టర్ అనుమతి లేకుండా, నోటీసుల్లోనూ వివిధ కారణాల్ని చూపిస్తూ, పత్రికను మూసేస్తామనే స్థాయిలో ఆర్డీవో శ్రీలేఖ బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు సంఘం రాష్ట్ర నాయకులు స్వామి, కిషోర్, మద్దాల రాంబాబు, ఆళ్ల వెంకట అప్పారావు, అనకాపల్లి, ఎలమంచిలి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల భాస్కరరావు, ఆడారి గంగాధర్, బి.గణేష్, ఎల్లపు రమాజీ, మళ్ల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం ఎపిఇపిడిఎస్ కార్యాలయం శనివారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ రావు తెలిపారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఉన్న కరెంటు సమస్యలను, లో వోల్టేజ్ సమస్య, పాత ఐరన్ పోల్స్ తీసి కొత్త పోల్స్, చాలాచోట్ల వైర్లు కిందకి వేలాడుతూ ఉండే సమస్యలు, కొత్తట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు తదితర సామాజిక సమస్యలతోపాటు వ్యక్తిగత విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదికలో అర్జీలను సమర్పించి పరిష్కారం పొందవచ్చని, పట్టణంలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలపై బ్యాంకు ఉద్యోగుల నిరసన

24, 25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి పిలుపు



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి- అనకాపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు బ్యాంకు ముందు నిరసన చేపట్టారు. బ్యాంకులలో ఔట్సోర్సింగ్ నియమాకాలు నిలుపుదల చేసి రెగ్యులర్ నియామకాలు జరగాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారంలో ఐదు రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. యూనియన్ బ్యాంక్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీలలో బ్యాంకు ఉద్యోగులు రెండు రోజుల దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక యూనియన్ బ్యాంక్ దగ్గర కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రీదేవి, శిరీష, రోజా శ్రీ, ఏవిజే రాజు,ఆడారి రాము, మాలతి బ్రాంచ్ మేనేజర్ మేనేజర్లు రమేష్ పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షుల నియామకం



కిశోర్‌ను అభినందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -కశింకోట :కశింకోట మండల వైసిపి అధ్యక్షునిగా మలసాల కిషోర్ నియమితులయ్యారు. అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ ప్రతిపాదన మేరకు పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మలశాల కిషోర్‌కు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు. కిశోర్‌ను సర్పంచులు కలగా గున్నయ్య నాయడు, కరణం శ్యాంసన్, వైసిపి నేతలు కరక సోమినాయుడు, చిన్ని వల్లభ నారాయణరావు, ఒమ్మి గంగు నాయడు, బుదిరెడ్డి రామారావు తదితరులు అభినందించారు.

వైసిపి మండల అధ్యక్షునిగా బాబూరావు

దేవరాపల్లి : వైసిపిమండల అధ్యక్షుడిగా బోయిల కింతాడ సర్పంచ్ బూరె బాబూరావును మళ్లీ నియమితులయ్యారు. మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. మాడుగుల మండలాధ్యక్షుడుగా వేమవరపు రామధర్మజ, చీడికాడ మండలానికి గొల్లవిల్లి రాజబాబు, కె.కోటపాడు మండలానికి రెడ్డి జగన్మోహన్‌ను పార్టీ మండల అధ్యక్షులుగా నియమించారు. దేవరాపల్లి పార్టీ అధ్యక్షులుగా బాబూరావును మళ్లీ నియమించడంపై వైసిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తన సేవలను గుర్తిస్తూ మండల అధ్యక్షుడిగా మరో అవకాశమిచ్చిన అధినేత జగన్మోహన్ రెడ్డికి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు బాబూరావు కృతజ్ఞతలు తెలిపారు.

లలిత ఫెర్రో పరిశ్రమను యథావిధిగా నడపండి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కార్మికులను విధులను రావొద్దనడం సరికాదని లలిత ఫెర్రో పరిశ్రమ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీని యథావిధిగా నడపడంతోపాటు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్యుతాపురంలో సిఐటియు ఆధ్వర్యంలోఫెర్రో పరిశ్రమ ప్రధాన గేట్ వద్ద నుంచి పోలీస్ స్టేషను వరకు కార్మికులు ర్యాలీ చేశారు.పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోమ నాయుడు మాట్లాడుతూ రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి పరిశ్రమను యథావిధిగా నడిపించాలని, కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలేదన్నారు విద్యుత్ బిల్లు కట్టకపోవడంతో గతనెల 23న ఆ శాఖ అధికారులు కరెంట్ కట్ చేశారని, అప్పటి నుంచి రోజూ కార్మికులు పనికి వస్తున్నా, ఫ్యాక్టరీ గేటు నుంచే వెనక్కు పంపించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కార్మికులను ఫ్యాక్టరీలోకి రాకుండా బయట పెట్టడం అన్యాయమని, వెంటనే ప్రభుత్వం, లేబర్ అధికారులు జోక్యం చేసుకొని లలిత పరిశ్రమను యథావిధిగా నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



లలిత ఫెర్రో పరిశ్రమ వద్ద ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

దేవాలయ పునర్నిర్మాణంలో అవినీతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి కొత్తపేటలోని పురాతన రామలింగస్వామి ఆలయ పునర్నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని యలమంచిలికి చెందిన పిల్లా సూకేశ్వరరావు శుక్రవారం దేవాదాయ శాఖ అధికార్లకు ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సింగిల్ ట్రస్టీ అధీనంలో ఉన్న ఆలయాన్ని, కొందరు ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకొని, అభివృద్ధి, పునర్నిర్మాణం పేరిట భక్తుల నుంచి విరివిగా విరాళాలు, అక్రమ వసూళ్లకు పాల్పడి, దేవాదాయ శాఖ అధికారులకు తెలియకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దేవాదాయ శాఖ అధికారులకు కనీస సమాచారం లేకపోవడం విడ్డూరమన్నారు. దేవాదాయశాఖ అధీనంలోని ఆలయంలో ప్రయివేటు వ్యక్తుల జోక్యం, అజమాయిషీ, అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి వివరణనిస్తూ, ఫిర్యాదు అందిందని, తాను కొత్తగా బాధ్యతలు చేపట్టినందున దీనిపై సోమవారం దర్యాప్తు చేస్తానని వెల్లడించారు..

సంపద సృష్టిపై మండలస్థాయి శిక్షణ



మానవహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న క్లాప్ మిత్రులు


ప్రజాశక్తి- దేవరాపల్లి : చెత్తను సంపదగా సృష్టించాలని, ప్రతి ఇల్లు స్వచ్ఛత నిలయం కావాలని దీనికి ప్రజలందరి సహకారం అవసరమనిఎంపిడిఒ ఎవి సువర్ణరాజు అన్నారు. ఇంటింటా తడిపొడి చెత్తను వేరుచేసి, క్లాప్‌మిత్రలకు అందజేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రులు మండలస్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ, నాలుగురోడ్ల ప్రధాన కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు పాటుపడదామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఒక రోజు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవరాపల్లి ఇఒ కె.సుధాకర్ బాబు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వివిఐ. త్రినాధరావు, ఎల్. లింగన్న, జామి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి.-సబ్బవరం: మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామపంచాయతీ శివారు ఎ.సిరసపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను బంగారమ్మపాలెం గ్రామ సర్పంచ్ దాడిలావణ్య కన్నమనాయుడు, ఆలయ కమిటీ నిర్వాహకులు అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. తెలుగు యువత పార్లమెంటరీఅధ్యక్షులు పివిఎస్ఎన్ రాజు, ఆలయ చైర్మన్ దాడి శివసత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, బలిరెడ్డి అప్పారావు, అప్పల నాయుడు, సిహెచ్ .కోటి, బి.పద్మ, దొడ్డి ప్రకాష్, రాజు కోటి, ఆడారి వెంకట్, కళ్ళ శ్రీనివాస్, చిన రాజు పాల్గొన్నారు.

విశాఖ పబ్లిక్ స్కూల్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : స్థానిక విశాఖ పబ్లిక్ స్కూల్ నూతన భవనాన్ని శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు విషయాలపై మాట్లాడారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గండి అప్పలరాజు, గండి వెంకట్, డ్రీమ్స్ నాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, బి రాందాస్ పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ధర వెలవెల... రైతులు విలవిల

గిట్టుబాటు కాక టమోటా సాగుదారుల డీలా
రవాణా ఛార్జీలైనా రావడం లేదని ఆవేదన
పొలాల్లోనే వదిలేస్తున్న పంట దిగుబడులు



పొలంలోనే వదిలేసిన టమోటా పంట

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : టమోటా ధరలు పూర్తిగా తగ్గిపోవడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆరుగాలం శ్రమించి, పెట్టుబడులు పెట్టి పండించిన పంట, ఆశాజనకంగా దిగుబడులు వచ్చినప్పటికీ, కనీస ధర లేకపోవడం, కొనే దిక్కు కానరాకపోవడంతో రైతన్నలు విలవిల్లాడిపోతున్నారు. లాభాలను పక్కనపెడితే, కనీసం ఏరివేత కూలీలు, రవాణా ఛార్జీలైనా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పండిన టమోటాలను అలాగే పొలాల్లోనే వదిలేస్తున్నారు.

మండలంలోనిబుచ్చెయ్యపేట, కందిపూడి, రాజాం, మల్లాం, తదితర గ్రామాల్లో మెట్ట ప్రాంతాల్లో వందలాది మంది రైతులు ఈఏడాది టమోటా సాగు చేపట్టారు.ఏటా పంట చేతికి వస్తుందన్న సమయంలో ధర పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. కిలో టమోటాలను రూ.పదికైనా అమ్ముడుపోని పరిస్థితుల్లో కూలీ, రవాణా ఛార్జీలు గిట్టుబాటు కాక దిగాలు చెందుతున్నారు. టమోటా సాగుకు వేలకువేలుగా పెట్టిన పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోతున్నామని తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పొలంలోనే పంటను వదిలేశాను



ఈ ఏడాది 80సెంట్లు విస్తీర్ణంలో టమోటా సాగు చేశాను. పంట బాగా పండింది. అయితే ధర లేకపోవడంతో ఏరివేత కూలీలైనా రానిస్థితిలో పొలంలోనే పంటను వదిలేశాను. పరిస్థితిని గుర్తించి, ప్రభుత్వమే ఆదుకోవాలి.

మడగల అవతారం, టమోటా రైతు
నేతవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పైలా వెంకటపద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. గత సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన సమస్యలపై చర్యానివేదికలను వివరిస్తూ, అన్ని శాఖల అధికారులు నివేదికనువినిపించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం , విద్య, ఆరోగ్య , గ్రామీణ నీటి పారుదల, గృహ నిర్మాణ, తదితర శాఖలపైఆయా శాఖల మండల అధికారులతో శాఖలవారీ సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, శాఖలవారీగా సమస్యలపై దృష్టిపెట్టి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా రోడ్లు, డ్రైనేజీలు తాగునీటి సమస్యల పరిష్కార చర్యలు వేగవంతం చేయాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజా సమస్యలను



మండల సభలో మాట్లాడుతున్న ఎంపిపి

పరిష్కరించాలని ఆదేశించారు గ్రామాల్లోని సమస్యలను ఎంపిడిఒ, తన దృష్టికి తెస్తేవాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలోఎంపిడిఒ ధర్మారావు, తహశీల్దార్ అంబేద్కర్, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి. -సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహ, పసిడి కలశ ప్రాణ ప్రతిష్ఠాపన శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెందుర్తి వైసిపి నాయకులు గండి రవికుమార్ కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

సబ్బవరం పిఎసిఎస్ మాజీ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు నీలవేణి, వైసిపి మండల అధ్యక్షులు కర్రి బాబు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపిటిసి యర్రంశెట్టి రాము, ఉప సర్పంచులు సురేష్, సిరపరపు వాసు నాయకులు యడ్ల నాయుడు, కరక రాము, గురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు లైన్ క్లియర్

చౌడువాడలో ఎట్టకేలకు సమకూరిన స్థలం
ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు



స్థలాన్ని చదును చేస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని చౌడువాడలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు లైన్‌క్లియర్ అయ్యింది. ప్రభుత్వం రూ.3.70 కోట్ల నిధులు మంజూరు చేసినా, స్థల సమస్య కారణంగా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో. ప్రస్తుతం డంపింగ్ యార్డ్‌ను ఆనుకుని స్థలం సమకూరడంతో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆ స్థలాన్ని చదును చేయిస్తున్నారు. సుమారు అర ఎకరం విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో పెద్ద చెట్లను తొలగిస్తున్నారు.దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమైౖ, ఈ ప్రాంతంలోని చౌడువాడ చుట్టుపక్కల గ్రామాల్లో లోవోల్టేజీ, ఇతర కరెంటు కష్టాలకు చెక్ పడే రోజు త్వరలో రానుంది. చౌడువాడ పరిసరగ్రామాల్లో లోవోల్టేజీ కారణంగా ఇబ్బందులు పడ్డ గృహ, పరిశ్రమల వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సబ్ స్టేషన్ ఏర్పాటుకు సర్పంచ్ ఎరుకు నాయుడు వైసిపి ప్రభుత్వం నుంచి పోరాడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే 33/11 కెవి సబ్‌స్టేషన్ పనులు మొదలుపెడతారు. సబ్ స్టేషన్ ఏర్పాటు తర్వాత . చౌడువాడకు ప్రత్యేకంగాక ఫీడర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో 24 గంటలు ద్యుత్ అందుతుంది. చౌడువాడ సబ్ స్టేషన్ పరిధిలో గరుగుబిల్లి, మల్లం పాలెం, పైడమ్మ పేట, పాచిలవానిపాలెం, గుల్లేపల్లి, గొందుపాలెం, చోడవరం మండలం రాయపురాజుపేట, సేమునాపల్లి , నరసాపురం, జుత్తాడ గ్రామాలు ఉంటాయని విద్యుత్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం చదును చేస్తున్న స్థలాన్ని చోడవరం విద్యుత్ ఎడిఇ,నర్సీపట్నం డిఇఇ పరిశీలించారు

సెల్ టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని విఆర్ఓ కమలమ్మ, సర్వేయర్ హరిలతో కలిసి పరిశీలించినట్లు సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తమ గ్రామానికి సిగ్నల్ సమస్య అధికంగా ఉండటంతో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండుమూడు కిలోమీటర్ల దూరం సిగ్నల్స్ కోసం వెళ్లి అవస్థపు పడుతున్న నేపథ్యంలో సెల్‌టవర్ ఏర్పాటుకు అధికారులు ముందుకొచ్చారన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ప శ్రీను, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



రిజిస్ట్రేషన్ పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సరోజిని

ప్రజాశక్తి -కోటవురట్ల: సాగుదారులంతా గుర్తింపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ సరోజిని సూచించారు. ఈనెల 25తో గడువు ముగుస్తున్న తరుణంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కాకపోతే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రైతు రుణాలు, పంట నష్టం బీమా పరిహారం, ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి రాయితీ వంటి పథకాలు అందవన్నారు. ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో ఒక యూనిక్ కోడ్ కేటాయిస్తారన్నారు. రైతులు ఆధార్, వన్ బి, ఫోన్‌ను తీసుకురావాలని తెలిపారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వడ్డాది : ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ఉద్యానవన పంటలపై ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక రాయితీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి జి ప్రభాకర్, మండల ఉద్యానవన అధికారి భాను పుష్ప లీలావతి కోరారు. తెలిపారు. శుక్రవారం కోమలపూడి తులసి కళ్యాణ మండపంలో ఐదు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడిరైతులకు పంట సస్యరక్షణపై సూచనలు చేయాలని, నాణ్యమైన పంట దిగుబడులకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. టమోటా పంట ధర పూర్తిగా పతనమైన నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పండించిన టమోటాలను పచ్చళ్లు, వంటి ఇతర పదార్థాలుగా మార్చుచేసి సద్వినియోగం చేసుకోవడంపై చైతన్య పరచాలని సూచించారు. ఆర్‌బికె సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మాడుగుల,చీడికాడ, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు

మోడల్ స్కూల్ విద్యార్థుల స్టడీ టూర్



డైట్‌లో ల్యాబ్స్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని పాటిపల్లి గ్రామంలోని ఎపి మోడల్ స్కూల్ ఒకేషనల్ ఐటి విభాగం విద్యార్థులు శుక్రవారం స్టడీ టూర్‌లో భాగంగా అనకాపల్లిలోని దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాలను సందర్శించారు. డైట్‌లోని ఐసిఇ, ఇఇఇ విభాగాలను సందర్శించి, అక్కడి ల్యాబ్‌లను పరిశీలించారు. ఆయా విభాగాల్లోని పరికరాలు, వాటి వినియోగం, పనితీరుపై ఉపాధ్యాయురాలు పీలా ఆశ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టడీ టూర్‌లో 63 మంది ఒకేషనల్ విద్యార్థులతో పాటుగా ఒకేషనల్ ట్రైనర్ లావణ్య కుమార్ పాల్గొన్నారు.

పలుచోట్ల మాతృభాషా దినోత్సవం



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, పద్య పఠనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు జిజిఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.విష్ణుమూర్తి, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు

తగరపువలస : భీమిలి మండలం మజ్జిపేట జెడ్పి హైస్కూల్‌లో ఈ నెల 18, 19, 21 తేదీల్లో భాషోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 18న ఇంగ్లీష్, 19న హిందీ, 21న తెలుగు సబ్జెక్టుల ప్రాధాన్యతను వివరించారు. హెచ్ఎం పి.ఉషారాణి, ఉపాధ్యాయులు బృంద, నారాయణ రావు, గిరిధర్‌పాల్గొన్నారు. చిట్టమ్మ, స్వరూప ఆయా భాషల ఔన్నత్యాన్ని వివరించారు. భువన విజయం నాటకాన్ని ప్రదర్శించారు.

పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, సెక్రెటరీ టి.థియోపిలస్, ప్రిన్సిపల్ ఎస్ఇ. ఫ్లోరా, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, తెలుగు విభాగాధిపతి వివిఎస్.రమాదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం గురించి మాట్లాడారు. పలు నృత్యాలు చేశారు. గీతాలు ఆలపించారు. ఏడవ తరగతి బాలురు పరమానందయ్య శిష్యుల తెలుగు భాష ప్రావీణ్యంపై లఘు నాటికను ప్రదర్శించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్వప్న, రమాదేవి, ఆశాలత, పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక ఉషోదయ విద్యాసంస్థల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు భాషా పరిరక్షణ సమితి అనకాపల్లి విభాగం కన్వీనర్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులు వర్షిని, సోనియా, జానకి, దివ్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోకవులు రచయితలు డాక్టర్ చక్రపాణి, ఎస్ తమ్మిరాజు, అమర జ్యోతి, రంగబాబు పాల్గొన్నారు.ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.న్ నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి అప్పారావు, కళాశాల డీన్ ఎస్ వెంకటవాసు, తెలుగు అధ్యాపకులు వి రమేష్ చైర్మన్ రమణాజీ కరస్పాండెంట్ కృష్ణ కుమారి పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో వన్ వే ట్రాఫిక్ జంక్షన్ తెలుగుతల్లి విగ్రహంవద్ద అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. జివిఎంసి గవరపాలెం ఉన్నతపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్, కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, నందేల అప్పారావు, తెలుగు ఉపాధ్యాయులు అచ్చియ్యనాయుడు, పొట్టి శ్రీరాములు సంస్థ చైర్మన్ నరసింహ మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి సిపిఐ కార్యాలయం శ్రామిక సదనంలో ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్ షిప్, ఆధ్వర్యంలో పి.జగన్నాధం నాయుడు అధ్యక్షతన అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం నిర్వహించారు కౌన్సిల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.వి మాధవరావు దాడి శివరాం, ఎం ఆర్.ఎస్. ప్రకాశరావు, మళ్ళ చక్రవర్తి, దొరబాబు, బొట్టా చిన్ని యాదవ్, దొరబాబు, సాయి లక్ష్మణ్ మాట్లాడారు.

నర్సీపట్నం టౌన్:అవసరానికి అన్ని భాషలను నేర్చుకోవాలి, కానీ అమ్మ భాషను మరచి పోకూడదని నర్సీపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రాజు సూచించారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్:అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు తెలుగు పద్యం, పరాయి భాషా పదాలు రాకుండా తెలుగులో మాట్లాడ్డం, చిత్రలేఖనం అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమ ముగింపులో న్యాయనిర్ణేతలైన మీగడ శశిభూషణరావు, చినసూర్యనారాయణ, జె.పి.శర్మ, ఫ్రాన్సిస్, అక్కునాయుడు, భాస్కరరావు, మోహనరావులను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల బాధ్యులు జి.ఎస్.రాజేశ్వరరావు, ఎం. ఎల్లాజీ,కె.సంతోష్ లు నాయకత్వం వహించారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఘన జీవామృతంను తయారు చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ మాట్లాడుతూ, ఈ జీవామృతం ద్వారా భూమిలో పోషకాలు పెరిగేలా పని చేస్తుందన్నారు. ఈ పద్ధతి ద్వారా ఖర్చు తగ్గి ఆదాయం పెంచుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ డివిజన్ నాగేశ్వరరావు, మోడల్ మేకర్ రామకృష్ణ, ఏపీసీఎన్ఎఫ్ గొలుగొండ మండల ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

రెల్లిలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎస్సీ వర్గీకరణలో రెల్లిలకు సమప్రాధాన్యత ఇస్తూ న్యాయం చేయాలని రాష్ట్ర రెల్లి మేధావుల సంఘం అధ్యక్షులు బండి ఆది సురేంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ, రెల్లిల వాటా శాతాన్ని 3 నుంచి 5 శాతానికి పెంచాలని కోరారు. గతంలో ఉన్న రెల్లి కార్పొరేషన్‌ను పునరుద్దరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ కొన నారాయణరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పొట్నూరి గోవిందరావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బండి రంజిత్, మాకవరపాలెం మండల అధ్యక్షులు వడ్డాది రమణ, నర్సీపట్నం అధ్యక్షులు చంద్రరావు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వాసవి క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్. పురంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు వాసవీ క్లబ్ ప్రారంభించారు. ఏఎల్.పురంలో ఉన్న 45 మంది ఆర్యవైశ్య సభ్యులతో కలిసి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పూర్ణిమా ఆధ్వర్యంలో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో క్లబ్ అధ్యక్షులుగా చెక్క వెంకట సంతోష్ బాలాజీ, జనరల్ సెక్రటరీ యక్కల నాగేశ్వరరావు, కోశాధికారిగా కుసుమంచి నానాజీ, మెంబర్లుగా బొలిశెట్టి పాపారావు, నూతిగట్టు అప్పలరాజు, షేగు బ్రహ్మాజీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కేశకుర్తి కుసుమకుమార్, రుత్తల జాగృతి ఎంపికయ్యారని హెచ్ఎం ఫ్రాన్సిస్ తెలిపారు. విద్యార్థులు చదువులోనే కాకుండా ప్రతిభ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. ఉపాధ్యాయుడు అల్లు అప్పారావు మాట్లాడుతూ చదువు పట్ల కోరిక ఏర్పడితే ఫలితాలు



నర్సీపట్నంలో అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వస్తాయని విద్యార్థులకు తెలియజేశారు. ఈ శిక్షణ రాబోయే కాంపిటీషన్ పరీక్షలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌లో సెలెక్ట్ అయిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల స్కాలర్‌షిప్‌గా లభిస్తుందని తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఇద్దరు చొప్పున తమ పాఠశాల నుంచి సెలెక్ట్ అవుతున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

రోలుగుంట:ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు రోలుగుంట మండలం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన షేక్ ఆయేషాబేగం ఎంపికైనట్లు హెచ్ఎం దేముడు మాస్టర్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పొందిన ఈ విద్యార్థికి ఏడాదికి రూ.12వేలు స్కాలర్‌షిప్ చెల్లిస్తారని, ఇంటర్మీడియేట్ పూర్తయ్యే వరకు రూ.48వేల నేరుగా విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌లో జమా అవుతాయన్నారు.



అవగాహన కల్పిస్తున్న బానోజీరావు

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి -కొత్తకోట:చెత్త సంపద కేంద్రాలతో స్థానిక పంచాయితీలకు సంపద పెంచుకునే అవకాశం ఉందని రావికమతం మండలం పంచాయతీ విస్తరణాధికారి బానోజీరావు అన్నారు. కొత్తకోట చెత్త సంపద కేంద్రం వద్ద శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రీన్ అంబాసిడర్ లకు చెత్త సేకరణ పై సంపద తయారీ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల పరి శుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయ వనరులుగా మలుచుకోవచ్చునని పేర్కొన్నారు. వర్మీ కంపోస్ట్, తయారీ అనంతరం రైతులకు ఎరువులు గా విక్రయించుకోవచ్చునని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో రెండు టీమ్‌లుగా ఏర్పడి తడి, పొడి చెత్తలను ఎలా వేరు చేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తకోట పంచా యతీ ఈవో జ్యోతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టి.అర్జాపురం, దొండపూడి పంచాయి తీ కార్యదర్శులు కృష్ణ మోహన్ , పోలిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యత

-ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమా దేవి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణిమా దేవి

ప్రజాశక్తి-నక్కపల్లి:మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ ఆధారిత పనులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమా దేవి తెలిపారు. నక్కపల్లి లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కోటి 20 లక్షల పని దినాలు కల్పించేందుకు లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే కోటి తొమ్మిది లక్షలు పని దినాలు కల్పించామన్నారు. ఇందుకుగాను 315 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే 91 శాతం పనులు పూర్తి చేసామన్నారు. 160 కోట్ల రూపాయలతో సీసీ, బీటీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. 742 గోకులం షెడ్లు మంజూరు కాగా, ఇప్పటికే 588 షెడ్లులు పూర్తి చేశామన్నారు. 2025 -26 ఆర్థిక సంవత్సరానికి కోటి 28 లక్షలు పని దినాలు కల్పించేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలోనూ అమృత సరోవర్, చేపల పెంపకం చెరువులు, పంట పొలాల్లో అభివృద్ధి పనులు, ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. రైతుల పంట భూముల్లో రెండు సెంట్ల మేర స్థలంలో ఫామ్ పాండ్స్ నిర్మాణం చేపట్టి, రైతుల ఫల సాయం పొందేందుకు ఫామ్ పాండ్స్ గట్లపై చెట్లు, కాయగూరల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఏటికొప్పాక లక్క బొమ్మల తయారీదారులకు కావలసిన కర్ర సరఫరా చేసేందుకు గాను అంకుడు చెట్లు పెంపకానికి ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమా దేవి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. నక్కపల్లి ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఎలమంచిలి క్లస్టర్ పరిధిలో 7 మండలాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటివరకు చేపట్టిన పనుల ప్రగతి, ప్రణాళికపై సమీక్షించారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతి పంచాయతీలో చేపట్టాల్సిన పనులపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. చిన్న, సన్నకారు రైతుల పంట భూముల్లో పనులు చేయడం వల్ల రైతులకు మేలు కలుగుతుందని, ఆ దిశగా పనులు చేపట్టాలన్నారు. వేతనదారులకు వంద రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు కచ్చితంగా ప్రతి ఒక్కరికి కి 300 రూపాయలు వేతనం వచ్చే విధంగా, మార్కింగ్ చేసి పని చేయించాలన్నారు. ఉపాధి పనులకు వస్తోన్న ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. . ఏటికొప్పాక లక్క బొమ్మల తయారీదారులకు చెక్క బొమ్మలు తయారీ చేసేందుకు గాను కర్ర కొరత ఉందని, దీనిని అధిగమించేందుకుగాను 25 వేల అంకుడు చెట్లు నాటేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని, ఫీల్డ్ అసిస్టెంట్లు మార్చి నెల అంతా చెట్లు నాటేందుకు స్థలాలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడి డి.ఎరకయ్య, ఏపీవోలు భాగ్యలత, నాని బాబు, క్లస్టర్ పరిధిలో ఉన్న 7 మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్సై రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో వాహన దారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహన దారులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం, హెల్మెట్ ధరించకపోవడం, ఇన్సూరెన్స్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వంటివి చర్యలకు పాల్పడరాదన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం వాహనాలను నడపాలని సూచించారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు



పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం (విశాఖపట్నం) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రాజు ప్రారంభించారు. వాలీబాల్, షటిల్, రన్నింగ్, షార్ట్ పుట్, బాక్సింగ్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు నెహ్రూ యువ కేంద్ర వారిచే సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, యువతి యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని తమ కళాశాలలో నిర్వహించిన నెహ్రూ యువ కేంద్ర వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేమ ఎన్జీవో ఆర్గనైజింగ్ సెక్రటరీ బోళెం శివ, లిఫ్ట్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ సెక్రెటరీ సిహెచ్‌విఎస్ఆర్.ప్రసాద్, ప్రముఖ వ్యాపారవేత్త వెలగ నారాయణరావు, మిరాకిల్ ఎన్జీవో సెక్రటరీ ఎం.అప్పలరాజు, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పి.జి.ఆర్.ఎస్) పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిర్ణీత సమయంలో సంబంధిత ప్రజా ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో పి.జి.ఆర్.ఎస్‌పై జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులకు జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ, ప్రజలకు అందిస్తున్న సేవల్లో భాగంగా ప్రజలు పెట్టుకున్న ఆర్జీలను / ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజు పి.జి.ఆర్.ఎస్ పై ఫిర్యాదులకు అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయం కేటాయించి వాటిని పరిష్కరించాల న్నారు. అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని, ప్రత్యేక ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆఫీసులోని నిపుణులు అశోక్ ఈ కార్యక్రమం విధివిధానాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎగ్జామినర్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, సిటీ ప్లానరు ధనుంజయ రెడ్డి, జోనల్ కమిషనర్లు, దామోదరరావు పాల్గొన్నారు.

యువకుల సేవాభావం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన యువకులు వినూత్న సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో అనాధ మృత దేహాల దహన సంస్కారాలు చేసేందుకు కావాల్సిన ఖర్చులు సమకూర్చేందుకు ముందుకు వచ్చారు. తమ కళ్ల ముందు జరిగిన ఒక చిన్న ఘటనకు చలించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు యువకులు చెప్పారు. గత పది రోజుల కిందట గ్రామానికి చెందిన మహిళ మృతి చెందిందని చెప్పారు. ఆమె మృత దేహాన్ని దహనం చేయడానికి కర్రలు కావాల్సి వస్తే వాటిని కొనడానికి డబ్బులు లేక రోజంతా అక్కడే మృతదేహాన్ని వదిలి వెళ్లి పోయారన్నారు. ఆమె కుటుంబం నిరు పేదలు కావడం తో తెలిసిన వారంతా చందాలు వేసుకొని దహనం సంస్కారాలు పూర్తి చేసారన్నారు. అలాంటి పేద మృత దేహాలకు దహన సంస్కారం చేసేందుకు కావాల్సిన ఖర్చులు తాము భరిస్తామన్నారు.తమ ఫోన్ నెంబర్లు శ్మశాన వాటిక వద్ద బోర్డు ఏర్పాటు చేశామన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా

-ఉపాధ్యాయుల గొంతునవుతా
-పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
-పలు చోట్ల విస్తృత ప్రచారం



చింతపల్లి మండలం వంగసార బాలికల ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న విజయగౌరి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్, చింతపల్లి, హుకుంపేట ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆమె శుక్రవారం అల్లూరి జిల్లాలోని చింతపల్లి, హుకుంపేట, అరకులోయ మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం జరుగనుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని అన్నారు. 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీన్ని రద్దు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిజానికి ఆ జిఒ రద్దు కాలేదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కొన్ని అంశాలను తీసుకొచ్చి అమలు జరుపుతున్నారన్నారు. దీని వల్ల ప్రాథమిక, మాధ్యమిక విద్యకు ప్రమాదం వాటిల్లనుందన్నారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.చిట్టిబాబు, ఐద్వా రాష్ట్ర నాయకులు వివి.జయ, సిఆర్‌టిల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నూకరాజు, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.జయరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.చిన్నయ్యపడాల్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనంజయ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు త్రిమూర్తులు రెడ్డి పాల్గొన్నారు.

రాంబిల్లి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్, మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్తి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం యుటిఎఫ్; సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఉన్న పెద్ద కలవలపల్లి, లాలం కోడూరు, కొత్తపట్నం జెడ్‌పి హైస్కూళ్లలో నిర్వహించిన ప్రచారంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, గురుకులాలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రశ్నించి, పోరాడే సత్తా ఉన్న పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న విజయగౌరి గెలుపు అవసరాన్ని ఉపాధ్యాయ ఓటర్లకు వివరించారు. ప్రచారంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎల్లయ్య బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు, జిల్లా నాయకులు సిహెచ్.శివాజి, సిహెచ్. పద్మనాభారావు, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు డి.కాశి పాల్గొన్నారు.

యలమంచిలి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా యుటిఎఫ్‌తో పాటు ఇతర సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలో యుటిఎఫ్, సిఐటియు నాయకులతో కలిసి రేగుపాలెం, పురుషోత్తపురం, పులపర్తి, ఏటికొప్పాక, సోమలింగపాలెం, జంపపాలెం హైస్కూళ్లలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎల్లయ్యబాబు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ పద్మనాభరావు పాల్గొన్నారు.



యలమంచిలిలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

విజయగౌరిని గెలిపించండి

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - గొలుగొండ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ కోరారు. విజయగౌరిని గెలిపించాలంటూ మండలంలోని చీడిగుమ్మల, జోగంపేట, కొత్త మల్లంపేట, ఎఎల్.పురం, చోద్యం హైస్కూళ్లు, ఎఎల్.పురం గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, గొలుగొండ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఉత్తరాంధ్ర సమస్యలపై చేసిన పోరాటాలను తెలియజేశారు. తన తరువాత కాలంలో అంటే 2017 నుంచి శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణి వినిపించని దుస్థితి నెలకొందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించే అవకాశం ఉంటుందన్నారు. అన్నిచోట్లా విజయగౌరి పట్ల ఆదరణ కనిపిస్తోందని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆమెను గెలిపించాలని కోరారు. విజయ గౌరి పోటీలో ఉన్న ఏకైక మహిళా అభ్యర్థి అని అందరూ గుర్తించాలన్నారు. ఆ మహిళా సభ్యురాలు గెలిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థకు చేస్తున్న ద్రోహం ఎక్కడ బయటపడుతుందోనని మిగిలిన అభ్యర్థులు ఆమెను గెలవకుండా నిలువరించడానికి పలు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కరోనా సమయంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఏమీ అమలు చేయలేదని తెలిపారు. శాసనమండలిలో నాటి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. అటువంటి పిడిఎఫ్ వారసత్వాన్ని విజయగౌరి కొనసాగించనుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.చిట్టియ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.